సాక్షి శ్రీకాకుళం

మంగళవారం ; 30 ; మే ; 2023



నిరసన జ్వాల

చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా వైఎస్సార్‌సీపీ నాయకులు బైక్ ర్యాలీలు చేశారు. మాటలను ఖండించారు. - 8లో



వైఎస్ జగన్‌తోనే అభ్యున్నతి

వైఎస్ జగన్‌తోనే అభ్యున్నతి సాధ్యమవుతుం దని మంత్రి ధర్మాన అన్నారు. జలుమూరులో పర్యటించారు. - 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్టం	కనిష్టం
ఆమదాలవలస	37°	26°
ఇచ్ఛాపురం	37°	27°
పాతపట్నం	37°	27°
శ్రీకాకుళం	38°	26°

న్యూస్‌రీల్

2న మెగా జాబ్‌మేళా

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జూన్ 2వ తేదీన నిర్వహించనున్న మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళాలో సుమారు 16 స్థానిక, బహుళజాతి ప్రైవేట్ సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని, ఈ సదవకాశాన్ని పదో తరగతి నుంచి పీజీ వరకు విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఉప కలెక్టర్ జయదేవి, ప్రత్యేక ఉప కలెక్టర్ మురళీకృష్ణ, ఉప కలెక్టర్ జి.జయదేవి, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీబీ సాయి శ్రీనివాస్ పాల్గొన్నారు.

'స్పందన వినతులు పరిష్కరించండి'



స్పందనలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్పందన వినతులు నాణ్యమైన రీతిలో పరిష్కరించాలని, సంతృప్తికరమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఉప కలెక్టర్ జయదేవి, ప్రకత్యేక ఉప కలెక్టర్ మురళీకృష్ణ, కలిసి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం శాఖల వారీగా సమీక్షించారు. ప్రతి దరఖాస్తును 24 గంటల్లో ఓపెన్ చేసి పరిష్కరించడమా లేదా తిరస్కరించడమా అనే అంశాలపై వివరణ ఇవ్వాలని సూచించారు. నేటికి 21 రీ ఓపెన్ ఉన్నాయని వాటిని వేగవంతంగా నాణ్యతా ప్రమాణాలతో పరిష్కరించాలన్నారు. స్పందన దరఖాస్తుల పరిష్కార విధానంపై ప్రతి వారం జిల్లా ఆడిట్ టీం ద్వారా ఆడిట్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ వెంకట్రామన్, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్, డీఎంహెచ్ఓ బి.మీనాక్షి, డీఎస్ఓ వెంకటరమణ అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఈకేవైసీ చేయించుకోవాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఖజానా శాఖ ద్వారా జీతభత్యాలు, పింఛను పొందుతున్న అందరు వేతనదారులకు, పింఛనుదారులు ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా ఖజానా శాఖ అధికారి రవికుమార్ తెలిపారు. జిల్లాలో ఉప ఖజానా కార్యాలయాల్లో ఈకేవైసీ నమోదు చేయడం జరుగుతోందని ఆయన వివరించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఉద్యోగులు, పింఛనుదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు.

కారుణ్య నియామక పత్రాల అందజేత



ఉద్యోగ నియామక పత్రాలతో అభ్యర్థులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: నిబద్ధత, అంకిత భావంతో విధులు నిర్వహించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సూచించారు. జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం పలువురికి కారుణ్య నియామక పత్రాలను జేసీ ఎం.నవీన్‌తో కలిసి అందజేశారు. పలు శాఖల్లో పనిచేస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులు 39 మందికి ఈ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఉప కలెక్టర్ జయదేవి, ప్రత్యేక ఉప కలెక్టర్ మురళీ కృష్ణ, ఉప కలెక్టర్ జి. జయదేవి, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, కలెక్టరేట్ ఏఓ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్పీ స్పందనకు 38 అర్జీలు


శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి 38 అర్జీలు అందినట్లు ఎస్పీ జీఆర్ రాధిక పేర్కొన్నారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

సజావుగా రెండో రోజు ఏపీ పీజీఈసెట్

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న పోస్టు గ్రాడ్యుయేషన్ ఇంజినీరింగ్, ఫార్మసీ ప్రవేశాలకు సంబంధించిన ఏపీ పీజీ ఈసెట్ రెండో రోజు సోమ వారం సజావుగా ముగిసింది. రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరుగుతుండగా, మొదటి షిఫ్టులో 83కి 74, రెండో షిఫ్టులో 72కి 63 మంది హాజరయ్యారు.

4 ఏళ్లలోనే.. నలభై ఏళ్ల వెలుగు

- సిక్కోలుకు అండగా సీఎం వైఎస్ జగన్
- గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రత్యేక ప్రాజెక్టులు మంజూరు
- వ్యవసాయం, పారిశ్రామిక, మత్స్యకార రంగాల్లో విశేష ప్రగతి
- మారబోతున్న సిక్కోలు రూపురేఖలు



శ్రీకాకుళం వెనుకబడిన జిల్లా.. రాష్ట్రానికి ఈ చివరన ఉన్న ఈ జిల్లా.. అభివృద్ధి, సౌకర్యాలన్నింటిలోనూ చిట్టచివరన ఉంది. ఇది పాలకులు, పార్టీలు అంగీకరిస్తున్న మాట. వాస్తవం కూడా ఇదే. జిల్లాను ప్రగతి బాట పట్టిస్తామని కూడా ప్రతి ఎన్నికల్లో హామీలు ఇస్తున్నా.. దశాబ్దాలుగా కార్యరూపం దాల్చని ఆ హామీలన్నీ వైఎస్ జగన్ ప్రభుత్వ పాలనలో ప్రాణం పోసుకుంటున్నాయి. జిల్లావాసులకు ఎన్నో మేళ్లు చేకూరుస్తూ వారిలో కొత్త ఆశలు నింపుతున్నాయి.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

వెనుకబడిన జిల్లాగా ముద్ర పడిన సిక్కోలు ప్రగతి దారిలో ముందుకెళ్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన నాలుగేళ్ల పాలనలో ఎనలేని సాయం చేశారు. ఉద్దానంను ప్రత్యేక దృష్టితో అభివృద్ధి చేస్తున్నారు. వ్యవసాయ ఆధారిత జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు జలయజ్ఞమే స్ఫూర్తిగా ప్రాజెక్టుల నిర్మాణంపై దృష్టి సారించారు. ప్రత్యేక ప్రాజెక్టులు మంజూరు చేసి జిల్లా దశ దిశను మార్చేందుకు పెద్ద ఎత్తున ప్రయత్నిస్తున్నారు.

ఉద్దానం కోసం..



కిడ్నీ వ్యాధులు అధికంగా ప్రబలుతున్న ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాలకు సీఎం అండగా నిలిచారు. పలాసలో రూ. 50కోట్లకు పైగా వ్యయంతో 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, కిడ్నీ వ్యాధుల రీసెర్చ్ సెంటర్, అతిపెద్ద డయాలసిస్ సెంటర్‌ను నిర్మిస్తున్నారు. ఇది కూడా పూర్తికా వచ్చింది. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధులకు ప్రధాన కారణం తాగునీరుగా భావిస్తున్న నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లాలో పలాస, ఇచ్ఛాపురం పరిధిలో 07 (ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, మందస, పలాస, వజ్రపుకొత్తూరు) మండలాల్లోని 807 గ్రామాలకు ఉపరితల రక్షిత మంచినీరు అందించేందుకు రూ.700 కోట్లతో ప్రాజెక్టు నిర్మించారు. త్వరలోనే ప్రారంభం కానుంది. సుమారు 5లక్షల 57వేల 633మందికి తాగునీరు అందించడమే దీని లక్ష్యం.

జలయజ్ఞంకు ఊపిరి



వ్యవసాయాధారిత శ్రీకాకుళం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు సీఎం వైఎస్ జగన్ నడుం బిగించారు. వంశధార ఫేజ్-2లోని స్టేజ్-2 పనులు పూర్తి చేయడమే కాకుండా నేరడి బ్యారేజీ నిర్మాణానికి ఉన్న అడ్డంకులు కారణంగా ఈ లోపు మొత్తం ఆయకట్టును సస్యశ్యామలం చేసేందుకు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ మంజూరు చేశారు. రూ.176.35కోట్లు మంజూరు చేయడమే కాకుండా ఇటీవల శంకుస్థాపన కూడా చేశారు. నాగావళి, వంశధార నదుల అనుసంధానం పనులు పూర్తి చేస్తున్నారు. మరో ఉద్దానంలోని మహేంద్ర తనయపై నిర్మిస్తున్న ఆఫ్‌షోర్ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు రూ.852కోట్లు మంజూరు చేశారు. ఇప్పుడా పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మడ్డువలస రెండో దశ పనులకు రూ.26.65 కోట్లు మంజూరు చేశారు.

మత్స్యకార సంక్షేమం..



అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకార సమస్యలతో పాటు వలసలపై ప్రత్యేక దృష్టిసారించారు. సుదీర్ఘ తీర ప్రాంతం ఉన్న జిల్లాలో మత్స్య పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు, జిల్లాలో విస్తారంగా దొరుకుతున్న ముడిసరుకులు, ఖనిజాలను ఎగుమతి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నారు.

- మూలపేట పోర్టు నిర్మాణం కోసం ఇప్పటికే శంకుస్థాపన చేశారు. ల్యాండ్ లార్డ్ మోడల్ విధానంలో రూ. 2,949.70కోట్లతో ప్రాజెక్టు నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే 25వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తోంది.
- మత్స్యకారుల కోసం రూ.366కోట్లతో బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తున్నారు. ఇటీవల సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన చేయడం జరిగింది.
- వజ్రపుకొత్తూరు మండలంలోని నీళ్లపేటలో రూ.11.95కోట్లతో జెట్టీ నిర్మిస్తున్నారు.
- మత్స్యకార భరోసా పథకం కింద ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున 2020లో 12,214మందికి, 2021లో 16,630మందికి, 2022లో 14043మందికి, 2023లో 15640మందికి రూ.15.64కోట్లు ఆర్థిక సాయం చేశారు.
- 2020లో 1234 మంది మత్స్యకారులకు రూ.1.42కోట్లు, 2021లో 1534మందికి రూ.1.15కోట్లు, 2022లో 1306మందికి రూ.1.31కోట్లను లీటర్ డీజిల్‌కు 9 రూపాయల సబ్సిడీ కింద అందజేశారు.

కొత్తకొత్తగా..

- సరుబుజ్జిలి మండలం వెన్నెలవలసలో వెటర్నరీ పాలిటెక్నికల్ కళాశాల మంజూరు చేశారు. దానికి సంబంధించిన తాత్కాలిక క్లాసులు ధన్నాన పేట ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో నిర్వహిస్తున్నారు.
- ఆమదాలవలస మండలం తొగరాంలో అగ్రికల్చరల్ పాలిటెక్నికల్ కళాశాల ఏర్పాటు మంజూరు చేశారు. తరగతులు కూడా ప్రారంభమయ్యాయి.
- బూర్జ మండ లం పెద్దపేటలో హార్టికల్చర్ రీసెర్చ్‌స్టేషన్ మంజూరు చేశారు.పనులు ప్రారంభమయ్యాయి.
- ఆమదావలస జగ్గు శాస్త్రులపేట వద్ద క్రికెట్ స్టేడియం మంజూరు చేశారు. పనులు ప్రారంభమయ్యాయి.
- జిల్లాకు మూడు ఆక్వా హబ్‌లను ప్రభుత్వం మంజూరు చేసింది. శ్రీకాకుళం, పలాస, పాలకొండకు కేటాయించింది. ఒక్కో హబ్ ఏర్పాటుకు రూ. 2కోట్ల వ్యయం అవుతుంది. ప్రభుత్వం రూ. 40లక్షల వరకు సబ్సిడీగా, మిగతాది బ్యాంకు ద్వారా రుణం అందజేయనుంది.
- జిల్లాలో రూ 105.62కోట్లతో నిర్మించిన 1280 టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేశారు. మరో 12 వేల గృహాల నిర్మాణం చేపడుతున్నారు.

వ్యవ'సాయం'



విత్తనాల నుంచి విక్రయాల వరకు అన్ని దశల్లోనూ రైతుకు ప్రభుత్వం అండదండలు అందిస్తోంది. రైతుభరోసా, సున్నా వడ్డీ, పంట నష్టపరిహారం ఎప్పటికప్పుడు అందజేస్తున్నారు. వైఎస్సార్ రైతు భరోసా కింద 2019-20లో 3,34,057మందికి రూ.451కోట్లు, 2020-21లో 3,80,901మందికి రూ.509.04కోట్లు, 2021-22లో 3,78,685మందికి రూ. 525.62కోట్లు, 2022-23లో తొలి విడతగా 3,02,832మందికి రూ.167.50కోట్లు చొప్పున, మూడో విడతగా రూ. 3,10,346 మంది రైతులకు రూ. 64.75కోట్లు ఆర్థిక సాయం చేసింది.

- వైఎస్సార్ పంటల బీమా కింద 2019-20లో 10,005 మంది లబ్ధిదారులకు రూ.3.20కోట్లు, 2020-21లో 49,404మందికి రూ. 54.70కోట్లు చెల్లింపులు చేసింది. 2021-22కు సంబంధించి 27మండలాల్లో గల 33,997మంది రైతులకు రూ. 33.01కోట్లు చెల్లించింది.
- తిత్లీ బాధితులకు,ప్రకృతి వైపరీత్యాల్లో నష్టపోయిన వారికి కూడా ప్రభుత్వం ఆర్థిక సాయం చేసింది.

వైద్యంలో విప్లవాత్మక మార్పులు



ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి పర్సు ఖాళీ చేసుకునే అగత్యం లేకుండా సర్కారు ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టింది. నెలకు రెండు సార్లు గ్రామాల్లో డాక్టర్లు పర్యటించి ప్రజల ఆరోగ్యాన్ని తెలుసుకుంటున్నారు. దీనికి తోడు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద వైఎస్ జగన్ ప్రభుత్వం ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తోంది.

- పాతపట్నం 50 పడకల సామాజిక ఆస్పత్రిని రూ.4.2కోట్లతో, జొన్నవలస ఆస్పత్రిని రూ.2.45కోట్లతో, లావేరులో రూ.1.2కోట్లతో, సోంపేట సామాజిక ఆస్పత్రిని రూ.4.60కోట్లతో, బారువ సామాజిక ఆస్పత్రిని రూ.5.60 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు. నాడు-నేడు కింద 83 ఆస్పత్రులను రూ.47కోట్లతో అభివృద్ధి చేశారు.

గ్రామ స్వరాజ్య సాధన..



గ్రామ స్వరాజ్య సాధనలో భాగంగా జిల్లాలో 833 సచివాలయాలతో పాటు 3154 కొత్త కార్యాలయ భవనాలు రూపుదిద్దుకుంటున్నాయి. రూ. 810.32 కోట్లతో శరవేగంగా పనులు జరుగుతున్నాయి. 834 ఆర్బీకేలు, 685 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, 802 అంగన్‌వాడీల నిర్మాణాలు సాగుతున్నాయి.

విద్యా దీపం..




విద్యార్థుల భవిష్యత్ కోసం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. బడులను బాగుచేశారు. చదువుల్లో నాణ్యత పెంచారు. పిల్లలను బడికి పంపించేందుకు తల్లులకు ప్రోత్సాహం అందిస్తున్నారు.

- నాడు నేడు కింద మొదటి ఫేజ్‌లో 1247 పాఠశాలను రూ. 286.22కోట్లతో సుందరంగా తీర్చిదిద్ది, మౌలిక సదుపాయాలను కల్పించారు.
- రెండో ఫేజ్ కింద రూ. 427.73కోట్లతో 1096 విద్యాసంస్థలను తీర్చిదిద్ది, మౌలిక సదుపాయాలను కల్పించే పనులు చేపడుతూనే ఉన్నారు.
- మార్పు పథకం కింద 18 వసతి గృహాల్లో రూ. కోటి 75లక్షలతో ప్రభుత్వం కొత్త హంగులు సమకూర్చింది.
- జగనన్న అమ్మఒడి కింద 2020లో 3,77,000మందికి రూ. 359.82కోట్లు, 2021లో 3,77,692మందికి రూ. 359.53 కోట్లు, 2022లో 2,00,150 మందికి రూ. 260.19 కోట్లు(ఎనిమిది నియోజకవర్గాలు) అమ్మవడి చెల్లించింది.
- జగనన్న విద్యా కానుక కింద 2020లో 2,49,405మందికి, 2021లో 2,74,509మందికి కిట్లు పంపిణీ చేసింది.
- జగనన్న విద్యావసతి దీవెన కింద ఎస్సీ విద్యార్థులకు 2020-21లో 64,623 మందికి రూ. 62.33కోట్లు, 2021-22లో 54,432 మందికి రూ. 51.94కోట్లు జమ చేసింది. 2023-24లో మొదటి విడత కింద 50,895మందికి రూ. 47.86కోట్లు అందజేశారు.
- జగనన్న విద్యా దీవెన కింద ఎస్సీ విద్యార్థులకు 2020-21లో మొదటి ఫేజ్‌లో 67,653 మందికి రూ. 33.91కోట్లు, రెండో ఫేజ్ కింద 67,940 మందికి రూ.32.97 కోట్లు, మూడో ఫేజ్ కింద 67,615 మందికి రూ. 32.49కోట్లు అందజేశారు. బీసీ విద్యార్థులకు 2020-21లో 58,809 మందికి రూ. 85.34కోట్లు, 2021-22లో 59,840మందికి రూ. 29.97కోట్లు చెల్లింపులు చేసింది. ఎస్టీ విద్యార్థులకు 2021-22లో 1460 మందికి రూ. 55.34 లక్షలు అందజేసింది. 2022-23లో రెండు విడతలకు గాను 53,867 విద్యార్థులకు రూ. 68.14కోట్లు అందజేశారు.



ప్రాణభిక్ష పెట్టారు



నాకు గుండె సంబంధిత వ్యాధితో చాలా ఇబ్బంది పడ్డాను. ఒక రోజు అకస్మాత్తుగా గుండె నొప్పి వచ్చింది. వెంటనే రాగోలు జెమ్స్‌లో చేరాను. ఆరోగ్యశ్రీ కార్డుతో వైద్యం చేయించుకునేందుకు అవకాశం దొరికింది. పది రోజులపాటు ఐసీయూలో ఉంచి గుండెకు సంబంధించిన అన్ని రకాల పరీక్షలు చేసి నా ప్రాణం నిలబెట్టారు. సుమారు రూ.లక్ష విలువైన వైద్యం, మందులు అందించారు. వైద్యం తీసుకున్న అనంతరం ఖర్చుల నిమిత్తం రూ.4500, చార్జీలకు రూ.100కూడా ఇచ్చారు. సీఎం వైఎస్ జగన్‌కు జీవితకాలం రుణపడి ఉంటాను.

– మద్దిల జయసింహ, బావాజీనగర్ 5వ లైన్, శ్రీకాకుళం.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



మత్స్యకారుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటాం. గతంలో ఏ ప్రభుత్వం మత్స్యకారుల గురించి ఆలోచించలేదు. కానీ నేడు మత్స్యకారులపై జగన్ చూపిస్తున్న చొరవతో మా తలరాతలు మారుతున్నాయి. నాకు మత్స్యకార పింఛన్ అందుతోంది. మా కుటుంబ సభ్యులకు మత్స్యకార భరోసా వస్తోంది. దీంతో కొంత వరకు ఆర్థిక ఇబ్బందులు తీరుతున్నాయి. అలాగే నువ్వలరేవు-మంచినీళ్లపేట వద్ద జెట్టీ, హార్బర్, భావనపాడు పోర్టు, బుడగట్లపాలెం వద్ద మరో హార్బర్ నిర్మాణాలతో భావితరాలకు బంగారు భవిష్యత్ లభిస్తుంది. మత్స్యకారుల కష్టాలు తీర్చే నాయకుడు పది కాలాలు పాటు చల్లగా ఉండాలి.

– పినాసి ధనరాజ్, మత్స్యకారుడు, లబ్ధిదారుడు, అక్కుపల్లి,వజ్రపుకొత్తూరు మండలం.

సాగునీటి సమస్య తీరింది



వంశధార ఫేజ్-2 జలాశయం పనులు చేపట్టి వంశధార రిజర్వాయర్‌లో నీటి నిల్వ చేసినప్పటి నుంచి రెండు పంటలకు సాగునీరు అందుతోంది. రిజర్వాయర్ నుంచి వంశధార కుడి ప్రధాన కాలువ ద్వారా సాగునీటిని విడిచిపెడుతున్నారు. ఈ నీటిని సాగునీటి చెరువుల్లో నింపుకుని పంట అవసరాలకు ఉపయోగిస్తున్నాం. ఒకప్పుడు వేసవి వచ్చిందంటే సాగునీటి చెరువులు ఎండిపోయేవి. ఇప్పుడు చెరువులు సాగునీటితో కళకళలాడుతున్నాయి. గతంలో ఖరీఫ్‌లో మాత్రమే వరి పండిచేవాళ్లం. ఇప్పుడు రబీలోనూ వరి పండించి అధిక దిగుబడులుసాధిస్తున్నాం.

– పల్లి అప్పలనాయుడు, రైతు, దబ్బుపాడు, ఎల్.ఎన్.పేట

పెన్షన్‌తో బతుకుకు భరోసా



రెక్కాడితే గానీ డొక్కాడని స్థితిలో బతికే నాలాంటి పేదవాడికి కిడ్నీ వ్యాధి రావడం మూలిగే నక్కపై తాటి పండు పడిన చందంగా మారింది. అసలే అంతంతమాత్రం ఆదాయం ఉన్న కుటుంబాల్లో వారికి కిడ్నీ వ్యాధి వస్తే మరణమే. కానీ సీఎం వైఎస్ జగన్‌నాకు రూ.10వేలు పెన్షన్ ఇస్తుండటంతో పాటు డయాలసిస్ కూడా అందిస్తున్నారు. ఆయన రుణం ఈ జన్మకు తీర్చుకోలేనిది. ఆ పెన్షన్ సాయం లేకుంటే మా కుటుంబం బతుకు రోడ్డున పడేది.

– బి.సూరయ్య, కిడ్నీవ్యాధిగ్రస్తుడు, కొత్తపుట్టుగ

నా పెద్దకొడుకు నాయనా...



చిత్రంలో ఉన్న వ్యక్తి వజ్రపుకొత్తూరు మండలం ఉండ్రుకుడియా పంచాయతీకి చెందిన కొర్ల సరస్వతమ్మ. ఈమెకు 75ఏళ్లు. తనను ఎవరూ పట్టించుకోని పరి స్థితుల్లో నా పెద్ద కొడుకు జగన్ మాత్రం ఇంటి తలుపు తట్టి వలంటీర్ ద్వారా రూ.2750 అందిస్తున్నాడని ఆమె ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉన్న కాస్త భూమికి రైతు భరోసా వచ్చిందని, ఇన్ని సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనే మళ్లీ సీఎం కావాలని కోరారు.

ప్రత్యేక పూజలు



శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కొత్తూరు: వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కొత్తూరు మండలం నేరడి కొండపై శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు నేరడి, బలద, పారాపురం సర్పంచ్‌లు చిన్నమ్ముడు, భారతి, రత్నాలుతో పాటు పలువురు పూజలు నిర్వహించారు. గతంలో ఎవరూ చేయని అభివృద్ధి వైఎస్ జగన్ చేసి చూపించారని అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరావు, లక్ష్మినారాయాణ, నూకరాజు, తిరుపతిరావు, ఆనందరావు, పంకజదాస్ పాల్గొన్నారు.

13 మందికి ఎంపీడీఓలుగా పదోన్నతులు

అరసవల్లి: పంచాయతీ రాజ్ శాఖలో విస్తరణాధికారులు (ఈఓపీఆర్డీ)గా, మండల, జిల్లా పరిషత్ కార్యాలయాల్లో అడ్మినిస్ట్రేటివ్ అధికారులు (ఏఓ)గా పనిచేస్తున్న సీనియర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఎంపీడీఓలుగా పదోన్నతులు కల్పించింది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ సూర్యకుమారి తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 93 మంది ఈఓపీఆర్‌డీలు, 112 మంది ఏఓలకు ఎంపీడీఓలుగా పదోన్నతులు లభించాయి. ఈ క్రమంలో జిల్లాలో ఐదుగురు ఈఓపీఆర్‌డీలకు, 8 మంది ఏఓలకు మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీఓ)గా పదోన్నతులు లభించాయి. జిల్లాలో వివిధ మండలాల్లో ఈఓపీఆర్డీలుగా పనిచేస్తున్న ఈశ్వరరావు, రాజేశ్వరరావు, రవికుమార్, హరిహరరావులకు ఎంపీడీఓలుగా పదోన్నతి కల్పిస్తూ.. పొరుగు జిల్లాలకు పోస్టింగులను కేటాయించగా, కోటబొమ్మాళి మండల ఈఓపీఆర్డీగా పనిచేస్తున్న కె.నిశ్చలకు స్థానిక జిల్లాలోనే ప దోన్నతి కల్పించారు. అలాగే స్థానిక జెడ్పీ మేనేజ్‌మెంట్‌లో ఏఓలుగా పనిచేస్తున్న ఎం.రవీంద్రబాబు, వి.తిరుమలరావులకు కూడా ఇదే జిల్లాలో విధులు కేటాయించారు. అలాగే జిల్లాలోని వివిధ మండలాల్లో ఏఓలుగా పనిచేస్తున్న ఎం. మన్మధరావు, జి.జయంత్ ప్రసాద్, కె.అప్పలనాయుడు, జి.కాశీ విశ్వనాథరావు, కె.వసంత్‌కుమార్, యు.కుమార్ పట్నాయక్‌లకు పొరుగు జిల్లాల్లో మండలాలకు ఎంపీడీఓలుగా కేటాయించగా, ఇతర జిల్లాల నుంచి కొత్తగా ఎంపీడీఓల పదోన్నతులతో ఎల్‌వీ అప్పారావు, ఎస్.రమణయ్య, సీహెచ్ ప్రేమలీల, కె.ఉషశ్రీ, ఆర్‌వీ రమణమూర్తి, టి.రమాదేవి, జె.ఉమామహేశ్వరి, జి.శివప్రసాద్, ఎస్.హనుమంతరావు, జి.చంద్రరావు తదితరులు ఇక్కడకు రానున్నారు.



జిల్లా పరిషత్ కార్యాలయం

ఇచ్చిన ఆప్షన్ల మేరకు జిల్లాల కేటాయింపు



ఎంపీడీఓలుగా జిల్లాకు చెందిన పలువురు మండల సీనియర్ అధికారులకు పదోన్నతులు లభించాయి. ఈ మేరకు పదోన్నతులు పొందిన వారి నుంచే మూడు ఆప్షన్లు తీసుకుని జిల్లాలను కేటాయించారు. ఈ ప్రకారం కొత్త విధుల్లోకి చేరాల్సి ఉంటుంది. అలాగే జిల్లాకు ఎంపీడీఓలుగా కేటాయించిన వారికి త్వరలోనే మండలాలను కేటాయించనున్నాం.

– ఆర్.వెంకట్‌రామన్, సీఈఓ, జిల్లా పరిషత్

క్లుప్తంగా

నేడు బొడ్డేపల్లి విగ్రహావిష్కరణ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): దివంగత బొడ్డేపల్లి రాజగోపాలరావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం మూడు గంటలకు శ్రీకాకుళం కొత్త రోడ్డు జంక్షన్ దగ్గర ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్టు కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ, స్పీకర్ తమ్మినేని సీతారాం, రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్‌లతో పాటు జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరవుతారని పేర్కొన్నారు. విగ్రహావిష్కరణ అనంతరం శ్రీకాకుళం శాంతి కన్వెన్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు ప్రజాప్రతినిధులు హాజరవ్వాలని కోరారు.

పాలిసెట్ ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ పాలిసెట్–2023 ధ్రువీకరణ పత్రాలు పరిశీలన సోమవారం ప్రారంభమైంది. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సహాయ కేంద్రం ఏర్పాటు చేశారు. మొదటి రోజు సోమవారం మొదటి ర్యాంకు నుంచి 12,000 మధ్య ర్యాంకు విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. ఈ పరిశీలనకు జిల్లా నుంచి 275 మంది విద్యార్థులు హాజరయ్యారు. 12001 నుంచి 28000 మధ్య ర్యాంకు విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు మంగళవారం పరిశీలిస్తారు. కౌన్సెలింగ్ ప్రక్రియను కౌన్సెలింగ్ కోఆర్డినేటర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గురుగుబెల్లి దామోదర్‌రావు, ఇన్‌చార్జి మురళీ కృష్ణ పర్యవేక్షిస్తున్నారు.

అర్హులందరికీ సంక్షేమం

- మెప్మా పీడీ కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరాలని జిల్లా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.కిరణ్‌కుమార్ అన్నారు. ఎచ్చెర్ల సాంకేతిక శిక్షణ కేంద్రంలో శ్రీకాకుళం నగర పాలక సంస్థ, ఆమదాలవలస, ఇచ్ఛాపురం, పలాస మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ రీసోర్సు పర్సన్లకు వారం రోజుల నుంచి శిక్షణ కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో సోమవారం పాల్గొన్న పీడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగు పట్టణాల్లో 51,000 మంది స్వయం సహాయ సంఘాల మహిళలు ఉన్నారని చెప్పారు. మన ప్రభుత్వం, మన సంక్షేమం, మన అభివృద్ధి అనే నినాదంతో అర్హులందరికీ పథకాలు అందజేస్తున్నట్లు వివరించారు.

• నిరసన జ్వాల

పేదల ఇళ్లపై చంద్రబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు కదం తొక్కాయి. పేదలకు ఏ నాడూ సెంటు భూమి కూడా ఇవ్వని చంద్రబాబు.. ఇప్పుడు వారికి మేలు జరుగుతుంటే చూసి ఓర్వలేకపోతున్నారని నాయకులు మండిపడ్డారు. బైక్ ర్యాలీలు నిర్వహించి టీడీపీ వైఖరిపై దుమ్మెత్తి పోశారు. ఇలాంటి నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా నిరసన ర్యాలీలు చేపట్టారు.


రణస్థలం: బైక్ ర్యాలీలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్ కుమార్, పార్టీ శ్రేణులు



కంచిలి: అంపురం జంక్షన్ నుంచి బయలుదేరిన నిరసన బైక్ ర్యాలీలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే సరేష్‌కుమార్ అగర్వాలాలు


పేదల ఇళ్ల స్థలాలపై చంద్రబాబు, అచ్చెన్న చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా టెక్కలిలో బైక్ ర్యాలీ చేస్తున్న దువ్వాడ వాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు.


ఆమదాలవలస : పట్టణంలో బైక్ ర్యాలీలో పాల్గొన్న స్పీకర్ తమ్మినేని సీతారాం

నేటితో ముగియనున్న ఉత్సవాలు

- నీలమణిదుర్గకు ప్రత్యేక పూజలు

పాతపట్నం: ఉత్కళాంధ్రుల ఆరాధ్యదైవం, నీలమణిదుర్గ అమ్మవారి పెద్ద పెండుగలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఘటాల ఊరేగింపుతో మంగళవారం ఉత్సవాలు ముగియనుండడంతో అందుకు అవసరమైన ఏర్పాట్లను ఉత్సవ హెడ్ కమిటీ సభ్యులు చేశారు. కాగా సోమవారం అమ్మవారిని ఇందిరమ్మ కాలనీతో పాటు పలువీధుల్లో ఊరేగించారు. పట్టాభి జంగిడిలో కొలువైన అమ్మవారిని వీధుల్లో ఊరేగించినప్పుడు మహిళలు చీరలు పరిచి ముగ్రాటలతో స్వాగతం పలికారు. ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల కాంతులు అబ్బురపర్చాయి. నగరంలో రాత్రి ఏడు గంటల నుంచి పది గంటలకు విద్యుత్, సాంకస్కృతిక కార్యక్రమాలు చూడడానికి భారీగా జనం తరలివచ్చారు. పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన దేవతా విగ్రహాలు సందర్శకులకు ఆకుట్టుకున్నాయి.


ప్రత్యేక అలంకరణలో నీలమణిదుర్గ


ఇందిరమ్మకాలనీలో ఊరేగితున్న అమ్మవారు

నేడు ఘటోత్సవం

అమ్మవారి ఉత్సవాలు మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలతో ముగియనున్నాయి. ఈ సందర్భంగా నగరంలో ప్రతి కుటుంబం నుంచి అమ్మవారి ఘటాన్ని సమర్పించనున్నారు. వారి బంధువులు, మిత్రులు కూడా ఘటాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. వేలాది మంది మహిళలు ఘటాలతో భారీగా ఊరేగింపుగా నీలమణిదుర్గ ఆలయానికి తరలి వెళ్లనున్నారు.

అక్రమ సంబంధమే ప్రాణం తీసింది

- మహిళ మృతి కేసును ఛేదించిన పోలీసులు
- హత్య వివరాలు వెల్లడించిన సీఐ రాము

కోటబొమ్మాళి: అక్రమ సంబంధం వల్లనే కోటబొమ్మాళి మండలం కురుడు పంచాయతీ ఎరకయ్యపేటలో తులసమ్మ హత్య జరిగిందని పోలీసులు నిర్ధారించారు. తనతో కొన్నేళ్లుగా అక్రమ సంబంధం పెట్టుకొని చనువుగా ఉన్న తులసమ్మ ఇటీవల తనకు దూరంగా ఉండడంతో పాటు వేరే వ్యక్తితో సన్నిహితంగా మెలుగుతోందనే హత్య చేశానని నిందితుడు పోలీసుల ఎదుట ఒప్పుకున్నాడు. ఈ కేసుపై సీఐ రాము సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. తులసమ్మ భర్త గంగులు, ఆమె అల్లుడి తమ్ముడు బొల్ల తాతారావులు ఐదేళ్ల కిందట నెల్లూరుకు వలస వెళ్లారు. అక్కడ కొన్నాళ్లు ఒకేచోట కలిసి పని చేశారు. ఆ సమయంలో తులసమ్మతో తాతారావుకు సాన్నిహిత్యం పెరిగింది. అది కాస్తా అక్రమ సంబంధానికి దారి తీసింది. అప్పటి నుంచి వీరి మధ్య సంబంధం కొనసాగుతోంది. ఆ తర్వాత తులసమ్మ భర్త గంగులు కూడా మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆమె ఎరకయ్యపేటలోనే ఒంటరిగా ఉంటున్నారు. అయితే ఇటీవల వీరిద్దరి మధ్య మనస్పర్థలు తలెత్తాయి. దీంతో ఈ నెల 18న తాతారావు ఎరకయ్యపేటకు వెళ్లి తులసమ్మతో ఘర్షణకు దిగాడు.

గ్రామస్తులు, కుటుంబ సభ్యులకు కూడా ఈ గొడవ గురించి తెలుసు. ఈ గొడవ తర్వాత తాతారావుతో తులసమ్మ సంబంధాలు తెంచుకుంది. తన ఇంటికి రావద్దని, ఫోన్ కూడా చేయవద్దని చెప్పింది. దీంతో ఆమె వేరే వ్యక్తితో సంబంధం పెట్టుకుని తనను వదిలేసిందనే అనుమానంతో తాతారావు ఈ నెల 27 ఆదివారం రాత్రి ఎరకయ్య పేటకు వెళ్లి ఆమెతో నమ్మకంగా మాట్లాడాడు. అర్ధరాత్రి సమయంలో తాడును మెడకు చుట్టి చంపేశాడు. అనంతరం గ్రామం సమీపంలోని టేకు తోటలో తులసమ్మ మృతదేహాన్ని ఒక చెట్టుకు ఉరి వేసి ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరిద్దామని అనుకున్నాడు. కానీ పోలీసుల విచారణతో నిజాలన్నీ వెలుగు చూశాయి. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.

జగన్‌తోనే అన్నివర్గాల అభ్యున్నతి

- మంత్రి ధర్మాన ప్రసాదరావు

జలుమూరు: అన్నివర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే వారి పేరిట ఇల్లు, అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, ఆసరా, వసతి దీవెన, విద్యా దీవెన తదితర పథకాలు అందించి వారికి సమాజంలో ఒక హోదా పెంచేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. తిమడాం గ్రామంలో రూ.ఏడు కోట్లతో ఏర్పాటు చేసిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, జగనన్న కాలనీ, జలజీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ తాగునీరు అందించే ట్యాంక్, కమ్యూనిటీ శానిటర్ కాంప్లెక్స్, రైతులకు వ్యవసాయ పరికరాలు, రజకుల విశ్రాంతి భవనాలను ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌తో కలిసి ప్రారంభించారు. అలాగే ఉన్నత పాఠశాల స్థాపకుడైన వెలమల లక్ష్మనాయుడు విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం సర్పంచ్ వెలమల సత్యవతి ఆధ్వర్యంలో జరిగిన సభలో మంత్రి మాట్లాడారు. పేద ప్రజలు ఉన్నత చదువులు చదవాలనే మంచి ఆశయంతో అమ్మఒడి అందించి వారు ఇంగ్లిష్ మీడియంతోపాటు కార్పొరేట్ స్థాయి విద్యను అభ్యసించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నారన్నారు. అయితే వీటిని చూసి ఓర్వలేని చంద్రబాబు, టీడీపీ నాయకులు ప్రజలకు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రజలు గత ప్రభుత్వాలకు.. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఉన్న తేడాను గమనించారన్నారు. రానున్న ప్రజాక్షేత్రంలో టీడీపీకి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పేదల సొంతింటి కల నెరవేరాలేనే ఉద్దేశంతో రూ.12 వేల కోట్లు ఖర్చు చేసి భూములు కొనుగోలు చేయడంతో పాటు 32 లక్షల పైచిలుక ఇళ్లు కట్టించిన ముందు చూపు ఉన్న నాయకుడు జగనని కొనియాడారు. ప్రణాళికా బద్ధంగా సంక్షేమం, అభివృద్ధిని చేస్తున్నారన్నారు.


భవనాలను ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన, ఎమ్మెల్యే కృష్ణదాస్

టీడీపీవి ఉత్తరకుమార ప్రగాల్భాలు

అన్నివర్గాల ప్రజల ప్రయోజనమే లక్ష్యంగా సీఎం జగన్ జనరంజక పాలన చేస్తుండగా.. ఇది చూసి ఓర్వలేని టీడీపీ నాయకులు అభద్రతా భావంతో మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణ దాస్ అన్నారు. ప్రస్తుతం 23 సీట్లు ఉన్న టీడీపీకి 163 వస్తాయని చంద్రబాబు అండ్ కో ఉత్తరకుమార ప్రగల్భాలు పలుకుతున్నారని.. వీటిని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. అధికారంలో ఉన్న వైఎస్సార్‌సీపీకి 151 సీట్లు ఉన్నాయని దీంతో రానున్న ఎన్నికల్లో 175కి 175 సాధిస్తామని ధైర్యంగా చెప్పగలుగుతున్నామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు, బీసీ జోనల్ ఇన్‌చార్జి ధర్మాన కృష్ణ చైతన్య, ఎంపీపీ వాన గోపి, ఎంపీటీసీ సభ్యుడు వెలమల ప్రభావతి, అల్లాడ, చల్లవానిపేట పీఏసీఎస్ అధ్యక్షులు ఎం.శ్యామలరావు, రాజప్పల నాయుడు, పార్టీ మండల అధ్యక్షులు కనుసు సీతారాం, వైస్ ఎంపీపీ తంగి మురళీకృష్ణ, సచివాలయ కన్వీనర్ ధర్మాన జగన్, నాయకులు మెండ రాంబాబు, వెలమల మురళీ, వెలమల అసిరినాయుడు, మెండ గోవిందరావు, ధర్మాన రమణ మూర్తి, మాజీ అధ్యక్షుడు ముసలి నాయుడు, మండల సలహాదారు పైడి విఠలరావు, వ్యవసాయ మండలి అధ్యక్షులు బుక్కా లక్ష్మణరావు పాల్గొన్నారు.

‘పెండింగ్ బిల్లులు అప్‌లోడ్ చేయండి’

శ్రీకాకుళం పాతబస్టాండ్: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో ఇప్పటివరకు చేపట్టిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను తక్షణమే అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జీజీఎంపి, నాడు–నేడు, పంచాయతీరాజ్ పనులు, ఉపాధి హామీ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మూడేళ్లుగా సాంకేతిక కారణాలతో ఆగిపోయిన బిల్లులతో పాటు ప్రస్తుత పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటివరకు రూ.52 కోట్ల బిల్లులు అప్‌లోడ్ చేశారని, వాటికి చెల్లింపులు జరిగాయని, మరో రూ.15.24 కోట్ల మేర చెల్లింపులు చేయాల్సి ఉందన్నారు. ఇవేకాకుండా ఇంకా చెల్లించాల్సిన బిల్లులు ఉంటే వాటిని శనివారంలోగా అప్‌లోడ్ చేస్తే, వాటికి చెల్లింపులు జరుగుతాయని కలెక్టర్ కలెక్టర్ స్పష్టం చేశారు. గడప గడపకూ మన ప్రభుత్వం జిల్లాలో ప్రారంభమై దాదాపు తొమ్మిది నెలలైందన్నారు. ఇప్పటివరకు 1636 పనులకు మంజూరు ఉత్తర్వులు ఇచ్చామని, వాటిలో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగానికి చెందినవి ఎక్కువగా ఉండగా, మిగిలిన శాఖలకు చెందినవి ఉన్నాయన్నారు. 1636 పనులకు గాను 320 పనులు పూర్తి అయ్యాయని, అందులో 90 పనులకు చెందిన బిల్లులు అప్‌లోడ్ చేశారన్నారు. మిగిలిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి దుర్మరణం

ఎచ్చెర్ల క్యాంపస్: ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోగా మరొకరు క్షేమంగా బయటపడ్డారు. అల్లినగరం జంక్షన్ వద్ద సోమవారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనలో విశాఖ అర్బన్‌కు చెందిన రాపర్తి వెంకటసత్య రాఘవేంద్ర (39) ప్రాణాలు కోల్పోయినట్టు పోలీసులు తెలిపారు. వెంకటసత్య రాఘవేంద్రతో పాటు మరో వ్యక్తి శ్రీకాకుళంలో జరిగిన ఓ ఫంక్షన్‌లో వంటలు చేసిన తరువాత తిరిగి ద్విచక్ర వాహనంపై విశాఖకు వెళ్తున్నారు. అల్లినగరం జంక్షన్ వద్ద వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో వెంకటసత్య రాఘవేంద్ర అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. వెనుక కూర్చున్న వ్యక్తి క్షేమంగా బయటపడ్డారు. ఆధార్ కార్డు, వెనుక కూర్చున్న వ్యక్తి సమాచారం మేరకు కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఎస్సై వి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


వెంకట సత్యరాఘవేంద్ర మృతదేహం

శేఖరాపురంలో చైన్‌స్నాచింగ్

మెళియాపుట్టి: మెళియాపుట్టి మండలంలో చైన్‌స్నాచింగ్ జరిగింది. శేఖరాపురం గ్రామానికి చెందిన నెయ్యిల కాంతమ్మ మెడలో నుంచి రెండు తులాల బంగారు పుస్తెల తాడును ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు తెంచుకొని పరారయ్యారు. శేఖరాపురం గ్రామశివార్లలో ముక్కడి పోలమ్మ గుడివద్ద ఈ సంఘటన సోమవారం జరిగింది. కాంతమ్మ కుటుంబ సభ్యులు గ్రామంలో ముక్కడిపోలమ్మ గుడి నిర్మాణం చేపట్టారు. సోమవారం గుడి వార్షికోత్సవానికి కుటుంబ సభ్యులందరూ హాజరయ్యారు. కార్యక్రమం ముగించుకున్న తర్వాత కాంతమ్మ కొడుకు ద్విచక్ర వాహనంపై తన తండ్రిని, భార్యను తీసుకెళ్లాడు. మళ్లీ వచ్చి తల్లి కాంతమ్మను తీసుకెళ్తానని చెప్పాడు. కాంతమ్మ గుడివద్ద ఒంటరిగా ఉండటాన్ని గమనించిన గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు గుడి సమీపంలో ద్విచక్ర వాహనాన్ని నిలిపారు. గుడిని సెల్‌తో సెల్ఫీ తీస్తున్నట్లుగా నటించి.. కాంతమ్మ వద్దకు వెళ్లి ఒక్కసారిగా ఆమెపై దాడి చేసి మెడలో ఉన్న పుస్తెలతాడును తెంపేశారు. అయితే కాంతమ్మ వారితో పెనుగులాడగా చంపేస్తామని భయపెట్టడంతో తాడును వదిలేయడంతో వారు పరారయ్యారు. అంతాఅయ్యాక కుమారుడు వచ్చాడు. గ్రామస్తులకు సమాచారం అందించారు. మెళియాపుట్టి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.


రోదిస్తున్న కాంతమ్మ

13 మందిపై కేసు నమోదు

పొందూరు: గోకర్నపల్లి గ్రామంలో ఆదివారం జరిగిన కొట్లాటకు సంబంధించి ఇరువర్గాలకు చెందిన 13 మందిపై కేసులు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. చొదరి వెంకటప్పారావు ఫిర్యాదు మేరకు ఎనిమిది మందిపై, సంపతిరావు సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై లక్ష్మణరావు సోమవారం తెలిపారు. గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని ఆమదాలవలస సీఐ పైడయ్య హెచ్చరించారు. కొట్లాటపై గ్రామంలో విచారణ చేపట్టారు. వారం రోజులుగా గ్రామంలో చేపల చెరువు విషయంపై జరిగిన వివాదంలో ఇప్పటికే 17 మందిపై కేసులు నమోదు చేశారు. దీంతో గ్రామంలో పికెటింగ్ ఏర్పాటు చేశారు. అయినప్పటికీ పోలీసుల సమక్షంలోనే ఆదివారం కొట్లాట జరిగింది.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,000–00
బంగారం(22సి. 10గ్రా.)	55,550–00
వెండి (కిలో)	77,000–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 500.00
విజయనగరం	రూ. 500.00
శ్రీకాకుళం	రూ.504.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹152	₹274	₹ 284